

# అడవి

ఎం. ఉమామహేశ్వరరావు

ఆక్రోశిస్తూ తన రెండు కాళ్ళమీద కూలి పోతున్న కూతుర్ని ఆప్యాయంగా భుజాలు పట్టుకుని లేవదీశాడు శంబడు. కళ్ళ వెంట ముత్యాల్లా కన్నీటి బిందువులు చెక్కిళ్ళ మీదుగా జారి నేలమీద పడసాగాయి. హృదయం ద్రవించి పోయింది. మమకారం తనువెల్లా తట్టింది. కడలిలా కదలి పోయాడు. కన్నప్రేగును ఆప్యాయంగా తడుముతూ ఉండిపోయాడు ఒకనిమిషం.

శంబడి అంతరాంతరాల్లోంచి జాలీ, కనికరం ఉబికి వచ్చిం దొక్కమారుగా. ఆ ఉధృత ప్రవాహం నుంచి తట్టుకుంటూ కూతురి ముఖంలోకి చూశాడు. ఆ ముఖం అమాయకంగా ఉంది. స్వచ్ఛంగా ఉంది. తండ్రికి ఇష్టం లేని పనెందుకు చేశానా అన్న బెంగ ఉంది. పైగా భీతహరిణిలా చూస్తోంది.

శంబడు ఆలోచించాడు.

తను కాదనగానే మొదలు నరికిన చెట్టులా కళ్ళ ముందే కాళ్ళ మీద కూలిన కూతురి వేపు బాధగా చూశాడు. గుండె లోతుల్లో ఎన్నెన్నో ఆనందపు పొంగులు దాచుకుంటూ, అపురూపమైన తమ ప్రేమ కథను బయట పెడుతూ, తన ముచ్చట తీరుతుందని తనను సమీపించిన ఆమె అభిప్రాయం శంబడిలో ఆలోచనే రేపింది. మళ్ళీ ఆలోచించ సాగాడు.

అవును. ఆమె కోరినదాంట్లో తప్పేముంది?

ఆమె కోరింది సబబే. న్యాయమే. మనసారా ప్రేమించి నోడిని మనువాడాలని ఏ పిల్ల దాని కుండదు? ఆ మగాడి ప్రేమలో ఉక్కిరి బిక్కిరవాలని ఏ కన్నెపిల్ల గుండెకాయ లెదురుచూడదు? అందుకు కులం,మతం అడ్డు రావాలా? అడ్డొస్తే ఆటేని తెగ తెంచుకుని అయినా ప్రేమించు కున్నోళ్ళు స్వతంత్రంగా వెళ్ళి పోరా? వెళ్ళిపోతారు. అయినా తన కూతురు తెలి వైంది. ఏది మట్టో, ఏది బంగారమో సూసి చూడ గలదు. సెప్ప గలిగే గేవం ఉన్నది. అలాటేది, మరి తన మనస్సు విప్పి, తండ్రిగా ఒక్కగా నొక్క కోరిక కోరింది. ఏమని?

ఏ కన్నెపిల్లయినా ఏటి కోరుతది?

తన మనసుకు నచ్చినోడితో మనువు సేయించ మని.

తన ముద్దూ, మురిపెం చూసుకునే మగోడితో 'తాళి' కట్టించమని.

మరి. తను కాదన్నాడు. వీల్లేదని గట్టిగా నిరాక రించాడు.

తను మానవత్వం మరిచి పోయాడా?

తనలో స్వార్థం పురి విప్పి నాట్యం చేస్తోందా? ఏమైంది తనకు?

శంబడి మనస్సు ఒక ఘడియ క్రిందట జరిగిన సంఘటనను మళ్ళీ జ్ఞప్తికి తెచ్చుకుంది.

''నువ్వా కోయజాతికి సెందిన సెంద్రుణ్ణి మనువాడటాని కీల్లేదమ్మా! కుదర్దు. ఆల్లకీ మనకూ సంబందాలు లేవు. ఆళ్ళు కొన్ని వందల సమచ్చరాలైనా సరే, అందుకోలేని ఎత్తులో మనం ఉన్నాం. ఈ అడివికి నీ తండ్రి నాయాదికాగి. ధరమాన్నీ నీతిని, కట్టుబాటునీ రచ్చించాల్సిన మనిషిని తప్పు కిందోడు సేత్తే సెమించగల్ను. కాని యజమానే సేత్తే ఎలా సెమించాల? నిన్న తగాడు ప్రేమించినా నువ్వు ఆతగోడినే కోరుకున్నా మన జాతికి మతానికీ కట్టుబాటుకి సెరుపు సేసినోళ్ళం అవుతాం. నీతి నియమాలు లేదోళ్ళం అయిపోతాం. కట్టుబాటును తప్పినోళ్ళం అవుతాం. అంతేకాదు, ఈ శంబడు

ఉహాశా కుల పెద్దగా ఉండానికి ఈల్లేని పరిస్థితే రావచ్చును. బాగ ఆలోసించుకో.''

ఆప్యాయంగా కూతురి భుజం తడుతూ అన్నాడు శంబడు.

తండ్రి ఉద్దేశం వినగానే ఆమె మనస్సు బాధగా మూలిగింది. కన్నుల్లోంచి చెప్పుడు చేయని కన్నీళ్ళు చెక్కిలిపై జారాయి. కళ్ళ ముందు ఎంతో అందంగా నిర్మించుకున్న వూహా రేఖలు హఠాత్తుగా అలుక్కుపోయి కనిపించాయి. తన తండ్రి శంబడుఅతడివికి న్యాయం సెప్పి తీర్పిచ్చే పెద్ద. కులాన్నీ, కట్టుబాటునీ కంటి పాపలాగ కాపాడుకోవలసిన మనిషిగా. అతని నోటి వెంబడి వచ్చిన ప్రతి మాటా, అదో శిలాలిఖితం.

ఆ ఆలోచన రాగానే ఆమె గుండె జల్లుమంది. ఆ వెంటనే శరీరం స్పృహ తప్పింది. అశక్తురాలైంది. అలాగే తండ్రి రెండు కాళ్ళమీద వాలిపోయింది.

శంబడు తెప్పరిల్లాడు. కూతుర్ని లేవదీసి సేద దీర్చసాగాడు.

● ● ● ●

ఆ రోజు మహాశివరాత్రి.

దుర్గ కొండ మీద నుంచి చల్ల కొండకూ, అక్కడి నుంచి 'దిగువ గుట్ట' వరకూ దిగి కింద నున్న విశాలమైన స్థలంలోకి వచ్చాడు శంబడు! వయస్సు జారిపోతూన్న సమయంలో పెద్దరికపు భారంతో తల వాలిపోతూంది.

పెద్దంచు ముతకపంచెను కాసె పోసి బిగించాడు. చిరుతపులి చర్మం కవచం లాగా బిగించాడు. అడుగులు వేసి నడుస్తున్నప్పుడు కదలాడే కాళ్ళ మీది వెండి కడియాలు అతని రాకను పసి గట్టేలా శబ్దిస్తున్నాయి.

నడుస్తున్న అడుగులు ఆగిపోయాయి.

అతడి సునిశితమైన కళ్ళు ఒక్కసారి చుట్టూ పరికించాయి. అక్కడే చిందర వందరగా ఏపుగా ఎదిగిన 'ఎర్రిమాను' కనిపించింది. ఆ మాను కొమ్మలు ఎన్నో ఏళ్ళుగా పెరుగుతూ, విశాలంగా బాహువుల్ని పరుచుకున్నాయి.

ఒకప్పుడు—అంటే పాతిక సంవత్సరాల కిందటి మాట. అది చాలా చిన్నది. అందమైంది. కాని ఇప్పుడు పెద్దదైంది. అనుభవాల సారమే జీవితం అన్నట్లు అనుభవంతో, తన మొదట్లో జరిగిన ఎన్నో మంచి చెడ్డలకు 'మనుసాక్షి'గా నిలుచుంది. అలసటగా నిట్టూరుస్తుంది. బాధగా కొమ్మల్లోంచి ఆకుల్ని రాలుస్తుంది.

ఆ ఎర్రిమాను దగ్గర ఎంతో ప్రశాంతి లభించినట్లయింది శంబడికి. ఒకప్పుడు ఈ ఎర్రిమాను మొదట్లోనే తను ఎంతో ఆవేశంతో, ఉద్వేగంతో సైలను నడుం పట్టి లేవదీసుకు పోయాడు. ఉద్రేకం, ఉత్సాహం ఆరిపోయాక ప్రశాంతత కోరుకోవడం మానవ లక్షణమా?

శంబడికి అలావే అనిపించిందా క్షణంలో.

అక్కడ ఆ ఎర్రిమాను దగ్గర...అదే చోటులో పాతికేళ్ళ కిందట జరిగిన ఒకానొక ముఖ్యమైన తీర్పు అతడి కళ్ళ ముందు కదలింది జ్ఞాపకాల తెరలను పూర్తిగా గాలిలోకి వదలేస్తూ.

● ● ●

గండశిలల్లోంచి వస్తున్న సెలయేటి తీగల్ని మతారంగా చేతితో మీటుతూ పచ్చిక మీద కూచుని ఎదురుగా చూస్తూంది 'సైల'. అదేగట్టు మీద వెల్లకిలా పడుకుని ఆకాశంలో పుచ్చపువ్వు లాంటి వెన్నెల వెలుగుల్ని ప్రసరిస్తున్న చంద్రుడి కేసి చూస్తున్నాడో యువకుడు.

అతడి పేరు శంబడు.

పాతిక సంవత్సరాల యువకుడు. నల్లటి శరీరం నున్నగా కాంతు లీనుతూంది. విల్లులా ఒంపు తిరిగిన ఒత్తయిన కనుబొమల కింద పట్టుదలతో మెరుస్తున్నాయి కళ్ళు.

చాలా సేపటినుంచి వాళ్ళిద్దరి మధ్య నిశ్శబ్దం నలుగుతూంది.

ఉండి ఉండి సెలయేరు చేస్తున్న గలగలా నాదాలు తప్పించి అంతటా నిశ్శబ్దం. ఎడమ పాదం మీద కుడి పాదం మోపి విల్లులా ఒంపులు తిరిగిన సైల అజంతా శిల్పంలా కనిపిస్తూంది. అందాల బొమ్మలా ఉంది. ఆమె పెదవులు మాటి మాటికి ఏదో ఉద్రేకంతో చలిస్తున్నాయి. అలా చలిస్తున్న ఆ పెదవుల మీద అప్పటికి ఏ పదిమార్లో తియ్యటి ముద్రలు వేశాడు శంబడు.

అలవోకగా కళ్ళు పైకెత్తి శంబడి వేపు చూసింది సైల. ఎటో చూస్తున్నాడు శంబడు.



"పొద్దు పొడిస్తే ఏటవుతాది? మనం సిన్న కూనలవా ఏటి? సింగం పిల్లంతోడివి నువ్వు. ఎదిరిత్తే ఎయ్యి ఏనుగుల్నైనా సంపీగలవు. నీ మీద ఇట్టంఉండి, నీతో కలిసి బదుకుదావనుకుంద మంటె ఈల్లంతా ఎందుకు జవాయింతరు?"

ఆవేశంగానే అంటున్నా, పైల ముఖంలో ఏదో భయం తొంగిచూస్తోంది. కలిసి కలకాలం కాపరం సేద్దామనుకున్న బతుకులు కలలుగానే మిగిలి పోతాయేమో అన్నంత బెంగ వ్యాపించింది. కట్టుబాటునీ, నిబంధనాల్నీ కాదని ఎదిరిత్తే ఏటవుద్ది? అడివిలోని పెజలంతా ఏకమైనా సరే శంబడివి ఏటీ సెయ్యలేరనే గట్టి నమ్మకం పైలకుంది.

సింహం ఆకలేసి నప్పుడే వేటాడుతుంది.

పెద్దపులి అపాయం శంకిస్తే చాలు వేటాడుతుంది.

చిరుతపులిమాత్రం అలా కాదు. శత్రుజాతి కనిపిస్తే చాలు, కండరాల్ని కఠిన పాషాణాలుగా మార్చుకుని శక్తి కొద్దీ వేటాడుతుంది. ధైర్యం, సాహసం, వేగం దాని సొత్తు. సాధారణంగా చిరుత పాలపడిన జంతువు బతకడం కద్దు. ఆకలి వేసినప్పుడే తినాలన్న తత్త్వం తప్ప బలంలో సింహాన్ని మించి ఉన్నాడు శంబడు.

అపాయం శంకించి కదలాడంటే అతడి బారి నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరు. ఇక శత్రువుగ కదలితే?

సంఘంగా కలిసి బతికే మనుషుల మధ్య అంతస్తులు, అడ్డుగోడ లుండ గూడ దంటాడు శంబడు.

ఇద్దరు ఆడా మగా యువకులు హాయిగా మనసులు కలుపుకుని మనువాడు కోవడానికి కులం, మతం అడ్డేమి టంటాడు. వాటిని సమూలంగా తుడిచి పారెయ్యాలంటాడు.

పైలకు నిద్ర వస్తోంది—శంబడు మాత్రం కంటికి నిద్ర రానీలేదు.




ఆ రాత్రి...

దట్టమైన అడవి చెట్ల మానుల మధ్య చువ్వ' మొక్కల ఆకులతో నేసిన ఒక ఇంటిలో రెండు మానవాకారాలు అర్ధరాత్రయినా సరే, నిద్ర పోక మెలకువగానే ఉన్నాయి. వాటి మధ్య ఏదో అత్యంత ముఖ్యమైన సంభాషణ చాలా సేపటినుంచి జరుగుతూంది.

అందులో ఒక ఆకారం వృద్ధుడైన 'కుశాంబి'ది. రెండో ఆకారం 'నాగమ్మ'ది.

వీళ్ళిద్దరూ శంబడి తలి దండ్రులు.

కొవ్వు దీపం వెలుగులో కుశాంబి ముఖం ఎర్రగా జేవురించి ఉంది.

"ఏటి జరగాలవుంటే అదే జరుగుతది. మన కంట కొన్ని నిబందనాలున్నాయి. మన లోని మనసులకి మరికొన్ని కట్టుబాట్లున్నాయి. ఆటిని కాదనలేం."

భార్యను ఓదార్చబోయాడు కుశాంబి. నాగమ్మలో కన్నప్రేగు మీద మమకారం మరింతగా పెరుగుతూంది. ఆమె హృదయం బాధగా ఆక్రోశిస్తోంది. కన్నకొడుకు శంబడు ఏమయి పోతాడో నన్న దిగులు వ్యాపించింది. ఆమె చెంపలు కన్నీటితో తడిసిఉన్నాయి. భర్త కుశాంబి వేపు బాధగా చూసింది. ఆ చూపులో జాలి కురిసింది. అభ్యర్థన మెరిసింది. ఆమె కన్నీటి బిందువుల్లో పుత్ర భిక్ష తళుక్కుమంది.

కుశాంబికీ నిద్ర రాలేదు.

పైకి చెప్పుకుని భోరున ఏడవలేకపోతున్నారిద్దరూ.

గూడెం న్యాయాధికారిగా రేపు తెల్లారాక తను ఎదుర్కొనబోయే సమస్య ప్రాణాంతక మైంది తమ తండ్రీ కొడుకుల మధ్య అంతులేని అగాధాన్ని సృష్టించ బోయేది. తమకు శాశ్వత ఎడబాటును కలిగించేది.

కారణం?

తన కొడుకు శంబడి తెగింపు తెలుసు. పట్టుదలా తెలుసు. అయినా ఏదో, ఎక్కడో చిన్నగా తళుక్కు మంటున్న ఆశ. తండ్రిగా గౌరవం ఇచ్చి, తన మాట వింటాడన్న ఆశ. కుశాంబి ఆ రాత్రి అసలు నిద్ర పోనేలేదు.

● ● ●

అడవిదున్న కొమ్ములోని ఇప్ప పువ్వు సారాను ఒంపి నోట్లో పోసుకుంటున్నాడు బదిరీ. అతడి చుట్టూ అనుచరులు పోగయి ఉన్నారు. వాళ్ళ ముఖాల్లో భయం కనిపిస్తోంది. తమ యజమాని బదిరీ ఆశించిన ఆడమనిషి పైల. దాన్ని మనువాడాలని చాలా కాలం నుంచి ఎదురు చూస్తున్న సమయంలో శంబడు పైలను తనదాన్నిగా చేసుకోవడం బాధగా ఉంది వాళ్ళకు. అయినా శంబడంటే చచ్చేంత భయం వాళ్ళకు.

పడగెత్తిన నాగుబామునైనా తప్పించుకో వచ్చును గాని, శంబడి బారినుంచి తప్పించుకోవడం బ్రహ్మతరం గాదని వాళ్ళకు తెలుసు.

కాల్చిన కుందేలు మాంసం ఎదురుగా నోరు వూరిస్తోంది. మండుతున్న నెగడు వెలుగులో బదిరీ తాగి తాగి మత్తుగా వాలిపోయాడు. తూలి పోయాడు. అలాగే అక్కడ నిద్రలోకి జారి పోయాడు.

● ● ●

మామూలుగా తెల్లవారింది.

అడవిలో అక్కడక్కడా గుడిసెలు వేసుకుని బతుకుతున్న అడవిజనం — భిల్లులు, కోయలు, చెంచులు, ముక్కాలు, సవరలు, గదబలు, కాలోగులు అంతా రకరకాలుగా దుస్తుల్ని ధరించి కబుర్లు చెప్పుకుంటూ దిగువ సుట్ట చేరిపోతున్నారు.

వాళ్ళందరిలోనూ ఒకటే ఆలోచన.

అర్జంటుగా అడవిజనం సభ దీర్చాలనీ, అందుకు పోగవమని టముకేయించినాడు కుశాంబి. అసలు విషయం ఏటోనన్న ఆలోచన వాళ్ళలో వచ్చింది.

ఆ అడవిజనానికి కొన్ని వింత వింత అలవాట్లున్నాయి.

అంతా కలిసి కట్టుగా పండుగలు, పబ్బాలు, చావులు, పుట్టుకలు జరిపించుకుంటారన్న మాటే గాని తీరా సమయం వచ్చేసరికి దేని కదే అయి పోతారు.

ఒకరి పిల్లనుగాని, పిల్లవాణ్ణిగాని మరొకళ్ళు పెళ్ళి చేసుకోరు. అందరి ఎదుట కొన్ని పద్ధతుల్ని ఆచరించి పెళ్ళిళ్ళు జరుపుకుంటారు.

ఒక జాతి పిల్లను, ఆమె తల్లీ, తండ్రీ అనుమతి లేందే మరొకళ్ళు పెళ్ళి చేసుకోరు. తలిదండ్రులు ఇష్టపడ్డా కుల పెద్దలు, పెద్దల ఆమోదముద్ర పడాల్సిందే. అలా కాని పక్షంలో కుల పెద్దలు సమావేశం జరిపి తప్పు విధించాల్సిందే. ఆ తప్పు చిన్నదిగానూ ఉంటుంది, పెద్దదిగానూ ఉంటుంది.

పెళ్ళయిన ఆడపిల్ల పెళ్ళిగాని మగాడితో మాట్లాడచ్చు. ఎదురు గౌరవం లభిస్తుం దామెకు. పెళ్ళికాని మగాడు మాత్రం మరో పెళ్ళిగాని ఆడపిల్లతో మాట్లాడరాదు. నవ్వకూడదు. అలా చేస్తే తప్పు చెల్లించాల్సిందే. అనక ఆ తప్పు రూపంగా దొరికిన సొమ్ము అందరూ కలిసి సారాకోసం ఖర్చు పెడతారు. ఇవన్నీ వీళ్ళ తగవులు. అడవిలోని నిబంధనలు. కులం పేరిట ఏర్పరుచు

కున్న కట్టుబాట్లు. ఇవన్నీ చూడడానికి భిల్ల నాయకుడు కుశాంబి పెద్దగా ఉంటాడు. అక్కడున్న అందరిలోనూ వయోవృద్ధుడు. ఆచార వ్యవహారాలు తెలిసి న్యాయం చెప్పగలిగే వా డతను.

అడవి కాలమానం ప్రకారం సూర్యుడు మోచేయి నీడ కొచ్చేడు. అక్కడి కప్పుడే ఆడా, మగా, పిల్లా పీచూ అందరూ పోగయిపోయారు.

కుశాంబి, అతని భార్య నాగమ్మ, బదిరి, మరో పెద్ద సంబంగి—చాలామంది కూర్చున్నా రక్కడ. దగ్గరగానే ఉన్న ఎర్రిమాను కివతల రెండున్నర గజాల దూరంలో శంబడు నించుని చూస్తున్నాడు. సైల ఎర్రిమాను మొదట్లో విచారంగా నించుని చూస్తోంది.

సంబంగి లేచి నించున్నాడు. అతడి నల్లటి శరీరంమీద వేసున్న తెల్లటి బొట్లూ, మెడ లోనూ, చెవులకూ వేసుకున్న పూసల హారాలూ, తలమీద అడవికోడి ఈకల కుచ్చూ, అతని కో ప్రత్యేకతను సంపాదించిపెడుతున్నాయి.

అందరూ నిశ్శబ్దంగా నించున్నారు.

సంబంగి గొంతు సవరించుకున్నాడు. "ఈ అడివిలోని మనుసులకి కొన్ని నిబంధనలు ఉన్నాయి. ఆ నిబంధనల్లో మంచీ చెడూ ఉన్నాయి. వయస్సు లోని మగోడు, అంతే వయస్సులోని ఆడపిల్లతో సెట్టా పట్టా లేసుకుని తిరగడం, పెద్దోల్ని ఎదిరించి దరమాన్నీ, నీతినీ కాలరాయడం మంచి పనిగాదు. అలగ సేత్తే నీతిని వదిలేసినట్లు గాదా! ఇన్నాళ్ళనుంచి కాపాడుకొస్తున్న నాయం నట్టేట్లో మునిగిపోతది. ఇప్పు డదె జరిగింది. ఈ శంబడు కోయపడుచు "సైల"తో నేత్తం కట్టేండు. తిరుగు తున్నడు. అది మంచిదిగాదంటే ఇనలేదు. కట్టుబాటును కాలరాస్కని ఎల్లిపోతన్నడు. దీనికి ఆ శంబడికి తగిన శిచ్చ ఇదించి దరమాన్ని రచ్చించమని కోరుకుంటన్నాను."

అంతా సెహబాష్ అన్నారు ముక్త కంఠంతో. కుశాంబి ఒక క్షణం ఆగి నోరు విప్పేడు. "శంబడు సెప్పవలసింది ఏమైనా ఉందా?"

శంబడు మస్తిష్కం చురుక్కుమంటూ ఆలోచించసాగింది. లేచి అడవిజనం మధ్యలోకి వచ్చేడు. కదలేటప్పుడు కదలే వాడి కండర మండలాన్ని చూసి నోరు వెళ్ళచూస్తున్నారు జనం.

"పోగయిన పెద్దలకీ, తల్లులందరికీ దండాలు. సంబంగి సెప్పిన దాంట్లో నిజం లేకపోలేదు. నేను సైలను లోవు చేసుకున్నాను. కాని ఎక్కడి కెల్లిపోనాను? ఎక్కడికీ లేదే! మా ఇద్దరికీ మనసులు కలిసినాయి. ఆలోసనలు కలిసినాయి. మాకు కులంతోనూ, జాతితోనూ పనేటుంటది? అట్లగయితే కులమూ, జాతీ సూస్తే ఇక్క డందరూ అన్ని కులాలోల్లూ, జాతులోల్లూ ఎందుకొచ్చిన్రను? ఒక జాతోల్లో, కులపోల్లో రావచ్చుగదా! మా ఇద్దరిదీ ఏరే కులం. అయితే మేం మనువు సేసుకోరాదా? పూసులాడుకోరాదా? ఇద్దరు ఇట్టపడ్డవోల్లు కలిస్తే ఏటయిపోతది? అసలు మా ఇద్దరూ కలిసి తిరగ కూడదని నిబంధ నాలు ఎట్టినోల్లు ఎవరు? అలా ఎట్టడానికి అల్లకున్న అధికారం ఏటీ?

మనిసీ. మనిసీ మంచిగుండాల...మనసు కలిస్తే కలిసుండాల. అదే దరమం. మే విప్పుడు సేస్తున్న దాంట్లో తప్పేటి? ... ఎప్పుడో, ఎవరో గేనం లేనోల్లు, బుద్ధి సచ్చినోల్లు నోటికొచ్చినట్లు నిబంధనాలు ఎట్టి పారెత్తే మనవంత ఆలోసన సెయ్య కుండా, దరమం ఆలోసించకుండాగుడ్డోల్లలాగపాటిం చడమేటి? అంచేత నేను సెప్పేదీ అంతే...మా ఇద్దరం పేమించుకున్నాం. మనువాడుకుంటాం. కలిసి బతకా లని అనుకున్నాం. మా ఇద్దర్నీ ఇడదీసే ఓల్లెవరో మరిందుకురండి."

చెప్పడం ఆపి చుట్టూ కలియ జూశాడు శంబడు. అంతా నిశ్శబ్దంగా చూస్తున్నారు. ఏమీ మాట్లాడ లేదెవ్వరూ.

కుశాంబిలేచాడు. "శంబా! నువ్వు సెప్పిందాంట్లో నీ కిట్టబడ్డ మంచి ఉండొచ్చును. మరి అయ్యన్నీ మన అడివి నీతి, నాయం దగ్గిర పనికిరావు. మన మందరం సేలకాలంగ ఈ అడివిలో బతుకుతున్నాం. అడివిలో కావలిసినన్ని జాతు లోల్లున్నారు. అలాగ నువ్సెప్పి ఎవురి కాల్లు నచ్చినోల్లతో సెట్టా పట్టా లేసుకు తిరిగితే ఇక నీతెందుకు? నిబంధ నెందుకు? ఏడి రగతం ఎనక ముందు సూడదన్నట్టుగ నువ్వు ఏకంగా మా అందరికీ నీతీ, నాయం గురించి సెప్పు తున్నావు. నీ కోసం ఇప్పుడు ఏరేగా ఏనీతీ మార్చలేం. రేప్పొద్దున్న నీ అప్పనో, సెల్లల్నో మరొడెవడో పట్టుకెలి పోతే సూత్త వూరుకుంటవా? నీ కులం

Surya

'సూర్య'

అత్యంత ఉన్నతమైన
స్వచ్ఛమైన తెల్లని
కుచ్చులుగల
టూత్‌బ్రష్.




సూర్య బ్రష్ ఇండస్ట్రీస్
పాడి మద్రాసు-600 050.

చిత్రకళను
అభ్యసించువారికి,
డ్రాయింగు టీచర్స్‌కు

ప్రఖ్యాత చిత్రకారులు శ్రీ కంచర్ల బ్రహ్మయ్యగారిచే రచియించబడిన

**"Free Hand outline and Model Drawing"**

చిత్రకళను అభ్యసించవలెనను ఆసక్తికలవారు ఈ పుస్తకము ద్వారా సులభ పద్ధతులలో ఉపాధ్యాయునితో నిమిత్తం లేకుండ మంచి చిత్రకళను అభ్య సించవచ్చును. మరియు గవర్నమెంటు నిర్వహించు లోయరు, హైయ్యరు డ్రాయింగు పరీక్షలకు పోవు విద్యార్థులకు ఇది కల్పతరువు. ప్రతి కాలేజి, హైస్కూలు లైబ్రరీ యందు విధిగా ఉండదగినది. క్రొత్త కూర్పులతో మూడవ ముద్రణ వెలువడినది. మంచి బైండింగ్. ఖరీదు రూ. 30—00 లు. వి. పి. చార్జి రూ. 5—00 అదనము. అడ్వాన్సుగా రూ. 10—00 ఎం.ఒ. చేయవలెను. మిగతా డబ్బుకు వి.పి. పంపెదము. వెంటనే మీ ఆర్డరు పంపవలసిందిగా కోరుతున్నాము.


**Mrs. K. BRAHMAIAH, 11/5, First Cross St., United India Colony, Kodambakkam, MADRAS-24.**

కాదు, జాతికాదు—అల్ల కోయలు. మనం బిల్లలం. అల్లకంటే మనం ఎన్నో ఇదాలుగా ముందుగున్నాం. పైలను మనువాడ టానికి అల్లకులపోడు 'బదిరీ' ఉన్నాడు. అడి కిచ్చి పైలను సెయ్యాలని ఎదురు సూత్తన్నారు. ఈడొచ్చిన అడపిల్లను తీసుకెల్లి తాననడం తప్పు. అ తప్పుకి ఇచ్చ ఉంది.''

ఆగి వూపిరి పీల్చుకున్నాడు కుశాంబి.

అంతా రెప్పవేయకుండా చూస్తున్నారు. కుశాంబి తన కొడుక్కి ఏం శిచ్చ విధిస్తాడోనని చూస్తున్నారు.

''నువ్వు చేసింది మన నిబందన పకారంగా తప్పు. నీతిని తప్పినావు. తప్పు ఒప్పుకుని లెంప లేసుకో. లేకపోతే ఈ అడివి తలకాడ నుంచి సివరదాక ఏ సోటా నువ్వుండకుండా అడివి ఇడిసి ఎల్లిపోవాలని




తీర్పు సెపుతున్నాను.''

గంభీరంగా అన్నాడు కుశాంబి.

శంబడి మనస్సు భగ్గుమంది. కన్నుల్లోంచి ఎరుపెక్కిన జీర ఎర్రగా తళుక్కున మెరిసింది. ఫాలభాగం భగభగమంటూ కాలనేత్రుని త్రినేత్రంలా వికసించింది.

ఎదురుగా ఉన్నది రాయైనా, వజ్రమైనా ఏదైనా సరే, పగ రగిలిన నల్లత్రాచు చూడదు. కాలకూట విషాన్ని చివ్వున వెదజల్లి అంతం చేస్తుంది. శంబడి శరీరం నిండా ఉవ్వెత్తున ఎగిసి పడుతున్న రుధిర ప్రవాహం అతణ్ణి నిలువ నీయకుండా చేయ సాగింది.

పైలవంక చూసేడు. ఆమె శంబడి వంకే రెప్ప వేయకుండా చూస్తోంది. చుట్టూ ఉన్న జనం వేపు చూశాడు. అంతా రెప్పలు వేయడం మరిచి పోయినట్లుగా చూడసాగారు.

క్షణంసేపు జనంలో కదలిక శూన్యమైంది.

దిక్కులన్నీ మౌనం వహించినట్లుగా క్షణంలోని అర క్షణంలో చివ్వున తాడి ఎత్తున లేచి పైలవద్ద కురికిన శంబడి ఉక్కు హస్తాలు పైలను సందిట్లో కిరికించుకున్నాయి.

కుశాంబి నిప్పు రవ్వే అయ్యాడు. సంబంగి చేతిలోని కర్రలోంచి పైకి లేచిన విషబాణం ఏ క్షణంలోనైనా శంబడి పై దూసుకు పోయేందుకు సిద్ధమైంది.

''శంబా! ముందా పైలను ఇడిసి పెట్టు.'' దాదాపుగా అరిచాడు కుశాంబి. ఎక్కడో కొండల్లో భయంకరంగా సింహం గర్జించినట్లుగా వినిపించిందా మాట.

శంబడు ఖాతరు చెయ్యలేదు.

''నబదీర్చి నోల్ల మాటలు లెక్క సేయక నిక్కరించి ఎల్లి పోవడానికి సూత్తే నీ ఎన్నులో, నీ గుండెలో, నీ మెడలో ఇసబాణాలు దిగుతాయి.'' హెచ్చరించాడు మరోసారి కుశాంబి. మండుతున్న కొలిమిలోని ఉక్కుపిడిలా గర్జిస్తున్నాడతను.

కనులు పూర్తిగా విస్ఫారించి చూశాడు శంబడు. అతడి చుట్టూ విల్లు అమ్ములు ధరించిన కోయజాతి వాళ్ళున్నారు. వారిలో మగ్గు, నవరజంగు, కోయి భీముడు, చిరతపులి వీరన్న, బదిరి మొదలైన వీరులంతా కనిపించారు.

గట్టుమీద నించుని ఆగ్రహంతో నిప్పులు కురుస్తున్నాడు కుశాంబి. పైల నడుము శంబడి చేతుల్లో నలిగి పోతూంది. అతని చూపు చుట్టూ పడింది. అతడు ఆలా తీక్షణంగా చూస్తుంటే పడగ విప్పి, తోకమీద లేచిన నల్లత్రాచు చుట్టూ కలియ చూస్తున్నట్లుగా ఉంది.

కుశాంబి ఎదురు చూస్తున్నాడు శంబడివిడువుకు.

శంభడు ఎదురు చూస్తున్నది కుశాంబి ఏమరు పాటుకు.

అడివంతా బిత్తరపోయి చూస్తోంది.

నాగమ్మ గుండె జారిపోయి నట్లయిం దొక్క మారుగా. ఆమె మాతృహృదయం ద్రవించిపోతూంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో, జరగబోతున్నదో గ్రహించలేని మనిషి గా దామె.

ఆమె అంతరాంతరాల్లో ఏదో సన్నగా కదలిక—ఎక్కడో గుండెలో చిన్నగా, సన్నగా బాధ. అది అలా అలా పెరిగింది. పెద్దదయింది. ఉధృతమైంది. కన్నపేగు నెవరో బలవంతంగా చంపేస్తున్న భావన—కళ్ళ ముందు శంబడిని ముక్కలు ముక్కలుగా నరికి పోగులు పెడుతున్నట్టు భ్రమ. అడివిలోనే పుట్టి, ఈ అడివిలోనే పెరిగి, చివరికి పట్టుదలకు లోనై, ఈ అడివిలోనే బలై పోతాడేమోనన్న బెంగ. ఆమె గుండె పూర్తిగా బరువెక్కి పోయింది. తట్టుకోలేక కూలిపోసాగింది.

ఆమె నోటి వెంబడి ఒక్కసారిగా బిగ్గరగా ఆర్తనాదం వచ్చింది. తక్కున పక్కకు తిరిగేడు కుశాంబి.

గుండెని చేత్తో పట్టుకుని కూర్చున్న స్థలం నించి పూర్తిగా నేల మీద రాలిపోతోంది నాగమ్మ.

అంతా రెప్పపాటులో జరిగిపోయింది.

కనుబొమలు ఆశ్చర్యంతో, అయోమయంగా పెద్దవయ్యాయి కుశాంబికి.

అనుకోని హఠాత్సంఘటన అది. మతి చలించి నట్లుగా చుట్టూరా గల జనం నాగమ్మ దగ్గరకు పరిగెత్తేరు.

మూలుగుతోం దామె బాధగా.

శంబడి హృదయం కలుక్కుమంది.

ఆమె తన తల్లి. నవ మాసాలూ మోసి, అల్లారు ముద్దుగా పెంచి పోషించిన తల్లి. అడివి తేనె, వెదురు బియ్యం కలిపి తినిపించిన మాతృమూర్తి. ఆనందం, ప్రేమ అడుగు అడుగునా, తన పాలతో పాటు పంచి ఇచ్చిన దయా మూర్తి. అయినా సాహసించి ఆమెను చేరడానికి కుదరలేదు శంబడికి.

భార్య పరిస్థితికి తల్లడిల్లేడు కుశాంబి ...

ఒక వంక భార్య పరిస్థితి — రెండో వంక కుల పెద్దగా, కట్టుబాటు కంటికి రెప్పలా కాపాడుకో వలసిన పరిస్థితి. ఆ విపత్కర పరిస్థితిలో అనుకోకుండా అతడి గుండె జావైంది.

కఠిన పాషాణాన్ని సైతం కన్నీరు కార్పించ గల స్థితి ఎదురైంది కుశాంబికి. గుండెని అరచేతితో పాముకుంటూ మూలుగు తున్న భార్య దగ్గర మోకాళ్ళ పైన కూర్చుంటూ కను రెప్పల చివర గుండా శంబడివేపు చూసేడు ...

కాని... శంబ డొక్కక్షణం కూడా ఆలస్యం చెయ్యలేదు.

పైల నడుము చేతుల్లో ఇరికించుకుని మెరుపులా పరుగెత్తేడు.

17—11—82

జరిగిం దేమిటో వెంటనే గ్రహించాడు కుశాంబి.

నడుముకు వ్రేలాడుతున్న చిరుత చర్మంలోని పటకాలోంచి నున్నగా తళుకు లీనుతున్న 'చురిక చేతిలోకి వచ్చింది. మరునిమిషంలో ఆ చురిక శంబడి వేపు గురిగా దూసుకుపోయింది.

కుశాంబి 'గురి' సాధారణంగా తప్పదు. కాని తప్పిందిప్పుడు. ఆత్రతగా, ఆందోళనగా విసిరిన ఆ చురిక శంబడి కాలి పిక్కను చీల్చేసింది. శంబడు చలించలేదు. కూలిపోలేదు. కత్తివేటు కాలిమీద పడిన పులిలా దూసుకు పోయాడు పైలతో. దట్టంగా ఉన్న అడవిచెట్లలోంచి పైలతో సహా మాయమయ్యాడు.

కింద కూలిపోయిన నాగమ్మ బాధగా ఒక్క ఆర్తనాదం చేసింది. అంతే ... ఆమె గుండెలు బ్రద్దలైంది. ఆ బద్దలైన గుండెలోంచి ఆమె ప్రాణ వాయువులు అనంతంలో కలిసి పోయాయి.

వృద్ధ సింహంలా భార్య మీద అలానే కూలి పోయాడు కుశాంబి.

• • •

గతం నుంచి వర్తమానం లోకి వచ్చేడు వృద్ధుడైన శంబడు. ఒత్తైన అతని కనుబొమలు తెల్లగా పండిపోయాయి. ఫాలభాగం ముడుతలు పడి అతడి సాహసాన్నీ, అతని గతాన్నీ విశాల పరుస్తోంది. అతడి కనుకొలకుల్లోంచి వెచ్చటి కన్నీటి బిందువులు, అనుభవం పండిన అతడి చెంపలమీదుగా జారి కింద పడ్డాయి.

తనతో ప్రాణానికి ప్రాణం పెట్టి, తన వాళ్ళందర్నీ వదలిపెట్టి వచ్చిన 'పైల'తల పుకొచ్చింది. తనతో బ్రతికిన ఆరేళ్ళలోనూ తియ్యటి స్మృతుల్నే మిగిల్చిపోయింది.

తన నా రోజు ప్రాణాంతకమైన పరిస్థితినుంచి తప్పించి, గుండె పగిలి ప్రాణాల్ని కోల్పోయిన తన తల్లి నాగమ్మ పేరే తనకూతురుకూ పెట్టుకున్నాడు.

తనకూతురు తన లాగే కోయజాతి వీరుడైన సెంద్రుణ్ణి ప్రేమించింది. ఆ ప్రేమను తనెందుకు అడ్డాలి? పవిత్రమైన ప్రేమకు ఈ మతాలూ, కులాలూ అడ్డు లెందుకు? తన అనుభవంలోంచి అసామాన్యమైన పాఠం నేర్చుకుంది ఈ నాడు తన కూతురి ప్రేమను మొగలంటా నరికెయ్యడానికా? వీల్లేదు ... అలా చేయకూడదు ... అందుకే తను మనఃస్ఫూర్తిగా సమ్మతించాడు. ఈ అడవిలో బతికే సెట్లూ, సేమల్లాగే, పులీ, పుట్టాలాగే మనుషులున్నూ, ఒకర్నొకళ్ళు అండగా, ఆనందంగా, కలిసి మెలిసి బతకాలి. పవిత్ర ప్రేమకు ఏ అడ్డూ లేకుండా సెయ్యడానికి తనలాంటి వాళ్ళు నడుం కట్టాలి.''

వృద్ధుడైన శంభడి ఆలోచనలు ఆగిపోయాయి. దూరంగా శబ్దం వినిపించిచింది. అది డప్పు శబ్దం. బూరా శబ్దం కూడా విన్పించింది. అటు చూశాడు.

నాగమ్మ నడుం మీద చెయ్యి వేసి వస్తున్న సెంద్రుడు కన్పించాడు. ఆ జంటనే కళ్ళార్పకుండా చూసేడు. అతడి హృదయం తృప్తిగా మూలిగింది. ఆనందంగా ఉప్పొంగింది.

అడవి పిక్కటిల్లేటట్లుగా డప్పులు మ్రోగేయి. ★

# ఊహాగానం

అత్త లేని కోడలు ఉత్తమురాలు ఓయమ్మా
కోడలు లేని అత్త గుణవంతురాలు. . .

**ఈ అత్తా కోడళ్ళ** తగాదాచాలాసైకలాజికల్ నాన్సెన్సు. తన కొడుకు, తన ప్రాణం ఇంకో ఆడదానికి లొంగి పోతున్నాడనే బాధ అత్తకుంటే, తన విభుడు, తన ప్రాణేశ్వరుడు తల్లి మాట వింటున్నాడని కోడలికి ఉంటుంది. ఈ అత్తా కోడళ్ళ తగాదాలు జానపద గేయాల్లో చాలా చక్కగా ఉంటాయి. వేడి పాల మీద వెన్న ఏదనీ, పచ్చి పాల మీద మీగడ ఏది అని ఒకళ్ళతో ఒకళ్ళు దెప్పుకుంటారు. ఆ వెన్నా, ఈ మీగడా కూడా మధ్య నలిగిపోయే మగవాడు.

లక్ష్మి సరస్వతుల అత్తాకోడళ్ళ తగాదా మన జానపదగేయాల్లో ఉంది. ఎప్పుడూ వీణ వాయించుకుంటూ హంస నెక్కి షికార్లు కొడితే ఇంట్లో పని ఎవరు చేస్తారు అంటుంది లక్ష్మిదేవి.

సరస్వతీ దేవి మాత్రం తక్కువదా. ఎప్పుడూ ముసలాయన కాళ్ళు దగ్గర కూర్చుని సేవ చేస్తున్నట్లు నటిస్తూ ఉంటే ఈ విశ్వ కుటుంబం మా ఆయన కనక సృష్టిస్తున్నాడు అంటుం దామె.

ఇంతకూ నీకు చదువు రావటం తప్పు అయింది అంటుంది లక్ష్మి.

నీకు డబ్బుంది అది నీ గర్వం అంటుంది తిరిగి సరస్వతి. ఈ విధంగా వాళ్ళ పోట్లాటకు అంతూ పొంతూ ఉండదు మన జానపద గేయాల్లో.

ఇక మానవులయిన అత్తా కోడళ్ళ దగ్గరకు వచ్చే సరికి కోడలు లేవక పోతే తప్పు. అత్త కూర్చుంటే తప్పు. అన్ని కుటుంబాలూ ఇలా ఉన్నాయని నే ననటంలేదు. చాలా మటుకు ఇంతే.

ఎప్పుడో నా చిన్నప్పుడు చూసిన సినిమా 'సక్కుబాయి'లో అత్తగారి లాటి వాళ్ళు ఇప్పుడు తరుచు కనిపిస్తున్నారు. కట్నం తేలేదని కిరసనాయిలుపోసి చంపే వాళ్ళూ, కొడుక్కి రెండో పెళ్ళి చేసేవాళ్ళూ వగైరా.

ఆమాట కొస్తే పూర్వం కన్నా మగవాడు ఇప్పుడు ఆడంగి లేకి వాడయ్యాడు. అటు తల్లినీ, ఇటు భార్యనీ అదుపులో పెట్టుకోలేని చవట. ఈ కట్నాల తగాదాలు ఇంత విపరీతం ఎందుకయ్యాయో ఈజీమనీ మీద ఇంత కోరిక ఎందుకో, కొడుకుల్ని అమ్ముకుని అత్తలు బాగుపడే దేమిటో అర్థం కావటం లేదు. కట్నం తీసుకున్న ఏ అత్త అయినా కొడుకుని బానిసగా అమ్ముకున్నట్లే. ఈ బొమ్మకు బొరుసు కూడా ఉంది.

ఆడ పిల్లకి అరణం ఇచ్చేవాళ్ళు ఎలాగో ఇస్తారు. ఇవ్వలేని వాళ్ళని పీడించి ప్రయోజనం లేదు. భాగ్యవంతుడైన ప్రతి తండ్రి బాగానే కూతురికి ముట్ట చెపుతాడు. అలాంటప్పుడు కోడల్ని గొంతు పిసికి చంపి, కిరసనాయిలు పోసి మంట పెట్టటం కేవలం రాక్షసత్వం. రేర్‌గా కోడళ్ళ చేత బాధలు పడే అత్తలూ లేక పోలేదు—అది వార్ధక్యంలో.

నాకు తెలిసి కొడుకూ, కోడలూ అన్నం పెట్టక పోతే అడుక్కునే వాళ్ళు అయిదారుగుర్ని చూశాను. ఇప్పుడు మిసెస్ గాంధి ఇంట్లో కూడా ముసలం పుట్టింది. దీనికి కారణం మిసెస్ గాంధి అని పత్రికలు వ్రాస్తున్నా, మనేకా డైరీని 'సూర్య' పత్రికలో ప్రచురిస్తామన్నా అత్తగారి తప్పు ఎంత మటుకు అనేది ప్రశ్న.

తండ్రి చంపబడి, భర్త యాక్సిడెంటు పాలయి, కొడుకు పసివాడై అత్తగారు అప్పుడే నీకేమీ వద్దంటే ఆ అమ్మాయి మనేకా కాస్త పిచ్చి పిల్ల అయిందేమోనని అనుమానంగా ఉంది. నిండు యౌవనంలో భర్త పోవటం రకరకాల పిచ్చికీ, హిస్టీరియాకీ, ఏదో చేద్దామనే ఆత్రతకీ కారణం అయి ఉంటుంది. సుమారు పదిహేడు కోట్ల రూపాయలు ఆమె చేతికి చిక్కాయని పత్రికలు రాస్తున్నాయి. పది లక్షల రూపాయలు పెట్టి పుస్తకాల కొట్టు కూడా కొన్నారని రాస్తున్నాయి. ఆరు వేల రూపాయలు ఇంటి అద్దె ఇచ్చి ఉంటున్నదట. నా వూహ తప్పే కావచ్చును. మిసెస్ గాంధి ఇంటి కంటే ఆమె ఇల్లే పెద్దదయి ఉంటుంది. ఎందుకంటే, ఢిల్లీలో అయినా సరే, ఆరు వేల రూపాయలు అద్దె అంటే మాటలు కాదు. ఎలవెన్సులు లేకుండా ఉంటే ముగ్గురు పార్లమెంటు మెంబర్ల జీతం కంటే ఆమె ఇంటి అద్దె ఎక్కువ.

ఇంటి అద్దే ఆరు వేల రూపాయలు పెడుతున్న మనేకా మిగతా ఖర్చు ఎంత పెడుతోందో ఆమె తల్లి అంతేశ్వరికీ ఆనంద్‌కీ, సంజయ్ గాంధి మిత్ర బృందానికీ తెలిసి ఉండాలి. తన దగ్గర ఉన్న డబ్బు అత్తగారికి ఎదురు నిలవాలంటే ఎంతా? సముద్రంలో నీటి బొట్టు. బహుశా ఆ డబ్బు కాస్తా కైంకర్యం చెయ్యాలనే బహుగుణ మంతనాలు చేస్తున్నాడేమోనని అనుమానం.

ఈ పేద భారతీయుల ఆస్తులు ఈ విధంగా అయిన వాళ్ళు, కాని వాళ్ళు అదే పనిగా అనుభవిస్తుంటే ఒక్క భగవంతుడు తప్ప దిక్కు కన పడటం లేదు. సంజయ్ విచార మంచ్‌కి అత్తగారు వెళ్ళొద్దన్నా వెళ్ళిందంటే ఆ పంజాబీ పిల్ల అతి సాహసురాలనే చెప్పాలి. సంజయ్ చనిపోవటం వల్ల నష్టం మిసెస్. గాంధికే ఎక్కువ. భర్త పోతే భర్త వస్తాడు. భార్య పోతే భార్య వస్తుంది. బిడ్డ పోతే బిడ్డరాడు తల్లికి. ఈ సింపుల్ విషయం గ్రహించకుండా ,మనేకాని రెచ్చగొడుతున్న ప్రబుద్ధుల్ని అనాలి. స్త్రీ సహజమైన అసూయ కూడా ఆమెలో ఉన్నట్లు కనిపిస్తున్నది. బావగారూ, తోడి కోడలూ గొప్ప వాళ్ళు అట్టే కాక పోయినా గొప్ప వాళ్ళనుకుని అసూయ పడుతోంది ఈ పిల్ల. మిగిలిన ఒక్క కొడుకునీ గుండెకి హత్తుకోటం మిసెస్ గాంధి తప్పు కాదు. అతను ప్రధాన మంత్రి అవుతాడని మన వూహాగానాలేగాని ఏం కనిపించటంలేదు. అమేథీ నియోజక వర్గంలో ప్రజలు అనాథలు కాకుండా మరో కొడుకుని ఈ యజ్ఞంలోకి తరిమిన మిసెస్ గాంధి గొప్పదే.

- లత